'బలీయసీ కేవలమీశ్వరాజ్ఞా'

అది వైశాఖపున్నమి. ఆఊరి జమీందారిణికి ఆనాడు బ్రాహ్మణులను బీద సాదలను తోచినరీతిగా సత్కరించే అలవాటు, అరఎకరముమేర ఆక్రమించిన ఆ భవనముచుట్టూ తాటియాకు పందిళ్ళు వేశారు.

పాడ్యమినుండి జమీందారిణికి తీరికలేదు. ఎవరికేది ఇచ్చేది, ఏ వస్తువులు కావలసినదీ విడివిడిగా దేనికది ప్రత్యేకంగా పట్టికల తయారుచేయించి వస్తు సామగ్రి సిద్ధపరచింది.

పౌర్ణమినాడు తెల్లవారుజాముననే లేచి, తలంటి పోసుకొని, దైనికములను ముగించుకొని, పందిటిలోకి ప్రవేశించింది. ప్రతిఏటా జరుగుతున్న దానధర్మాలు కనుక సూర్యోదయము కాకముందే పండితులు, పటువులు, ముత్తైదువలు నిర్దేశింప బడిన ప్రదేశాలలో ఆసీనులయారు. బీదవారంతా చాపలమీద కూర్చున్నారు; లెక్కలేనంతమంది.

సుమారు ఏడున్నరగంటలకు వర్జ్యము వెళ్ళిన తరువాత జమీందారిణి సత్కారము ప్రారంభముచేసింది. బ్రాహ్మణులు మంత్రసూక్తాలు శ్లోకాలు చదివి, సంభావనలు అందుకొని, స్వయంగా తమచేతికి అందిస్తున్న జమీందారిణిని దీవించి పోతున్నారు

పదిగంటలయేసరికి జనము పలచబడినది. పందిటిలోని జనమునంతా కలయ జూచిన జమీందారిణికి ఆత్మీయులెవరో రాని వెలితి చటుక్కున తోచింది. ఆమె విశాలనయనాలు మరొకసారి.... మరొకసారి.... ఆ పందిటిలో ఉన్న ఒక్కొక్క రిని పరిశీలించి వెతకినాయి. 'ఇంకా రాలేదేమి.... ఇంకా రాలేదేమి' అని ఆత్ర పడుతున్నది ఆమె హృదయము.

'వీరయ్యః చెల్లమ్మా రామయ్యలు ఇంకారాలేదు. నేను నిన్న సాయం కాలము కబురుకూడా చేశాను సుమా. ఎందుకురాలేదో? నీవు స్వయముగా వెళ్ళి

తీసుకొనిరా. అద్దాలబండి తీసుకొని వెళ్లు' అని పంపింది. మాట పొంతము చెప్పక ముందే వీరయ్య కదిలివెళ్లాడు.

అప్పటికి అంగవస్త్రాల-చెంబుల దొంతరలు తరగిపోయాయి. బీదలకిచ్చే ధాన్యపుబస్తాలు ఖాళీఅయాయి. రవికపీటీల పళ్లేలు వట్టివయాయి.

వెళ్ళిన అరగంటకే వీరయ్య బండితో వచ్చాడు. బండిలోనుంచి సుమారు పాతిక ఏళ్ళ చెల్లమ్మ ముందుగాదిగి చేతులు పట్టుకొని రామయ్యను దింపింది. కొయ్య కాళ్ళతో, చేతులక్రింద పెట్టుకొన్న కర్రలసహాయంతో, రామయ్య నిముషానికి ఒక అడుగు వేస్తూనూ, చెల్లమ్మ అతనికి ఆసరాగా ప్రక్కనుంచి నడుస్తూనూ వస్తుంటే హృదయవిదారకమైన ఆ దృశ్యానికి జమీందారిణి కళ్లవెంట ఆపలేని అశ్రుప్రవాహము బయలుదేరింది. కొత్తగా అదృశ్యము చూసేవారికి కళ్లవెంట వచ్చేవి నీళ్లుకాదు, రక్తపుబొట్లేమో అన్నట్లుగా ఉంటుంది.

ఆ దృశ్యము ఆమె నాలుగు సంవత్సరాలుగా చూస్తూనేఉన్నది. చూపినప్పుడల్లా అంతదుఃఖము కలుగుతూనే ఉన్నది. ఏనాడు ఆ పుణ్యదంపతుల దర్శనముతో తన హృదయము విప్పారి ప్రేమాంకుర మేర్పడినదో ఆ వైశాఖపున్నమినుండి దాని స్మారకచిహ్నముగా ప్రతిఏటా బ్రాహ్మణ బీదసాదలకు తోచినరీతిగా దానము చేయటము ప్రారంభించినది.

* * * *

జమీందారిణి శకుంతలాదేవి వేసవికాలములో తన భవనమును చల్లగాఉంచే ఏర్పాట్లు చేయిస్తున్నది. ఫిబ్రవరినెలలోనే, 'నీలగిరి వెళ్లటమా, బెంగుళూరు వెళ్లటమా' అని యోచించి ఏర్పాట్లు చేసుకునే ఆమెకు, రెండేళ్ల క్రిందట, పెద్దవిపత్తు తటస్థించింది. బలంగాలేచి తిరుగుతూ తిరుగుతూ ఉన్న జమీందారుకు రెండువినాల జ్వరంతో మాట నిలిచిపోయింది. స్థలము కదల్పకుండా చికిత్సచేసి చూడాలని స్థానిక ఘనవైద్యులు తంటాలు పడుతున్నారు. అందుకనే పందిళ్లతోటి తడకల తోటి ఉన్నచోటనే చల్లదనము ఆపాదించాలని సకల ప్రయత్నాలూ చేస్తున్నది జమీందారిణి.

ఆ ఉదయమే మేదరిగుడిసెలలోనుంచి చెల్లమ్మ రామయ్యల జోడా జమీందారుగారింటికి తడకలు తీసుకొని బయలుదేరింది. పల్లెపదాలతో-యౌవనపు సరా

గాలతో ఒకరినొకరు తోసుకుంటూ రాసుకుంటూ-రాజభవనము సమీపించేసరికి ఎని మిది దాటింది.

'పడమరన ఉన్న గదిముందర వసారా మాదిరిగా వంపుగా తడక కట్టిస్తే ఎండయొక్క తీక్షణము లోనికి రాకుండానూ, గాలి వచ్చేటట్లుగానూ ఉంటుం'దని జమీందారిణి శకుంతలాదేవి మేదరరామయ్యకు చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

'మామా! ఊఁ పని మొదలుపెట్టు. కానీ ... అక్కడొక్కటీ.... ఇక డొక్కటీ గడలు పాతు. పురికొస జేబులో పెట్టుకో. ఊఁ ధోవతి పైకికట్టు....'

'పెద్దపెద్ద మాటలు చెప్తున్నావుగాని చేసేదానిని కాదుగా. గునపము తీసు కరా. కూర్చుని ఎన్నికబుర్లయినా చెప్పవచ్చు.... అవునా'

గజములోతు గుంటలు తవ్వి గడలను వాటిలో దింపుతున్నాడు రామయ్య. గడ్డపార తిరగవేసి గుంటలను మట్టితోపూడ్చి దిమ్మెన చేస్తున్నది చెల్లమ్మ. ఈ రెండు పనులు పూర్తిచేసి రామయ్య గోడకు నిచ్చెన వేసుకున్నాడు. సుమారు పన్నెండు గజాల ఎత్తునుంచి స్లోపు దింపుకుంటూ, ఆరు ఏడు గజాల ఎత్తుకు తీసు కొని రావాలి. ఒక నిచ్చెన పొడుగుచాలక రెండు నిచ్చెనలను కలిపి తాళ్ళతో గట్టిగా బిగించి కట్టున్నాడు.

రామయ్య రెండు నిచ్చెనలను కలిపి తాటితో బిగించి కట్టుంటే ఆమె స్నిగ్ధ హృదయానికి అశ్చర్యము కలిగింది. 'మామా బ్రహ్మదేవుడు ముళ్ళువేసినట్లుగా వేస్తున్నావే. రెండు నిచ్చెనలను కలిపి తాళ్లతో బిగించి కట్టున్నావే? ఈ బిగింపు సళ్లిచ్చినా, తాడు నలిగినా, ఏమవుతుందో ఊహించావా మామా.'

'ఊహించకేం? వెర్రిముఖానికి నీకేనా ఆలోచనాశక్తి? రెంటినీ బంధించే తాడు వన్నగిల్లినా, బిగింపు సళ్లిచ్చినా ఏ క్షణానికి విడిపోతాయో అన్నట్లుగా ఉంటాయి నిచ్చెనలు. నేనయితే గట్టిగానే బిగించి కట్టున్నాను.'

'అబ్బా! ఎంత చెమటపోసిందో? తుడవనీ అప్పుడు తాగిన గంజినీళ్లు కాస్తా అరిగిపోయినట్లున్నాయి, వచ్చేటప్పుడు మూటకట్టి తీసుకొచ్చిన అన్నము రొట్టెలు ఈవైపు తడక కట్టిన తరువాత తిందుగాని.'

'నే నొక్కణ్ణే తింటానా? నీకు మాత్రము ఆకలి కావటములేదూ?'

'నేనూ తింటాను. నేనే కలిపి ముద్దలుచేస్తాను.'

కూనిరాగాలు తీస్తూ నిచ్చెనమెట్లు ఎక్కిపోతున్నాడు పురికొన, పెద్దకత్తి, మేకులు జేబులో పెట్టుకొని, జుట్టు సవరించుకుంటూ, కిందకిచూస్తూ........

'చూస్తూ నిలబడక, కాస్త నిచ్చెన గట్టిగా పట్టుకో.'

'నీ పనితనము చూద్దాము. ఈ తడకను కాసేపటిలో ఆ మేకులకు తగిలించు. మాటలలోఉన్న వడి పనిలో ఉందో లేదో చూస్తాను.' కవ్వించింది.

'నీవు పనిముఖ మెరుగుదువా పిల్లా? 'ఏ ఊరు ఏ దేశము పిల్లా నీది?' రాగచ్ఛాయ లెరుగని రామయ్యపాటకు చెల్లమ్మ పక్కన నవ్వింది.

వీళ్ల మాటలు శకుంతలాదేవి చెవిన పడుతున్నాయి. ఆమెకు నవ్వటాలు తుళ్ళటాలు అసలే పనికిరావు. 'ఏమిటీ? మీ రిద్దరూ పనిచేయటానికి వచ్చారా లేక సరసాలాడటానికి వచ్చారా? మీ అల్లరే అప్పటినుంచీ నా చెవిని పడుతున్నది. పని జరుగుతున్నట్లు లేదు.' అని కిటికీదగ్గర నిలబడిన శకుంతలాదేవి మందలించింది. ఆ జంటను

'దొరసానీ, అది ఆపితే నేను పనిచేయకుండా ఆగుతానా? అదంతే. మాట్లాడుతూ-పాటలు పాడుతూ-నాకు అడ్డమువచ్చి పని జరగకుండా చేయాలని చూస్తుంది. నేనేమీ పని ఆపి ఒసేవాణ్ణి కాదు తల్లీ' అన్నాడు పైకి ఎక్కిన రామయ్య.

'ఏయ్ అమ్మీ. నీవు సిగ్గైనా లేకుండా వాడినెందుకు ఊరకే పలుకరిస్తావు? వాడు చేసేపనికి అడ్డము వస్తున్నావు తెలిసిందా?' 'నేను మాట్లాడిస్తూ పదాలు పాడుతుంటేగాని ఆయన పని చేయలేడమ్మా అసలు, నా మాట నిజమవునో కాదో చూడండి, కాస్త నేనటు పోయివస్తాను' అని ధీరాలు పలుకుతున్నది చెల్లమ్మ.

'అఁహఁ. అదొకటా ఈ మేదరివాడికి? బాగానే ఉన్నది లక్షణము!' అనుకుంటూ శకుంతలాదేవి లోపలికి వెళ్ళిపోయింది.

ఆమెను లోపలికి పోనిచ్చి గవ్వలు గలబరించినట్లుగా ఇద్దరూ నవ్వుకున్నారు. ఆ నవ్వులోని శబ్దతరంగాలు నలుదిశలూ వ్యాపించి మారుమ్రోగాయి.

'మామా! వాళ్ళలాగ మనము నోరుమూసుకొని పని చేయగలనూ? మాటా

మంచీ లేకుండా. ఎవరిగదిలో వాళ్లు కూర్చుని కాలము వెళ్లదీస్తారు. మనమయితే అట్లా ఒక్క క్షణముకూడా ఉండలేము.'

మనసును ఉఱ్ఱూతలూగించే రాగంలో జానపదుల పాట పాడుతోంది. అతడు తన గొంతుకూడా కలిపాడు. అతడి మనసు ఏదో ఏదో అయిపోతున్నది..

'మామా, పాట పాడావుగాని ముసలివాళ్లు ఏరి మనకు ? పిల్లోణ్ణి చంక నేసు కొని కదూ వెళ్లేది ? ఊరికే వెళ్దామనుకున్నావు ?'

'అవునుకదూ ! సరిసరి. చాలాఉందే ? పోనీ నీవో పదము పాడు ?'

'నీవు పాడినట్టుగా-సన్నగా.... తియ్యగా.... నేను పాడగలనా ? నవ్వకుమరి నా కొచ్చినట్లుగా నేను పాడతాను ఏం ?'

ఉప్పొంగినహృదయంతో, జగమంతా రామమయంగా తోచిన చెల్లమ్మ అప్రయత్నంగా అలకలో పెనివిటికి దూరంగా జరిగి కవ్వించే పాట ఒకటి పాడింది.

నిచ్చెన మీద కాళ్లు ఆనించి, ఒక చెత్తో మేకు పట్టుకొని మరొక చేత్తో మేదరికత్తి తిరగవేసి మేకును కొట్టున్నాడు రామయ్య. ధ్యాసంతా దాని మీదనే కేంద్రీకరించి.

ఇంతలోకే పై నుంచి పెద్దబరువు క్రిందపడ్డచప్పుడు! 'అయ్యో! అయ్యో!' అన్న కేకలు ప్రక్కగదిలో ఉన్న శకుంతలాదేవికి వినపడ్డాయి. ఆమె యివతలికి వచ్చి చూసేసరికి కూలీలంతా చెల్లమ్మచుట్టూ మూగారు. అందరూ ఒక్కసారే ''ఏమయింది ఏమయింది? ఎట్లా పడ్డాడు?'' అని అడుగుతున్నారు.

రామయ్య రెండు కాళ్ళూ మోకాళ్ళ క్రింది నుంచి ఊగులాడుతున్నాయి. ముఖం నిండా రక్తము! మాటలేకుండా మూలుగుతున్నాడు.

''అయ్యో! మామా, కాళ్ళు.... నీ కాళ్ళు.... విరిగి పోయాయా?'' అంటూ తడిబట్టతో ముఖము తుడిచి విసరుతున్నది చెల్లమ్మ.

అక్కడ మూగిన కూలీజనమంతా చెల్లమ్మ దుఃఖము చూడలేక కంట తడి పెట్టారు.

ఆ దృశ్యానికి శకుంతలాదేవి హృదయములో కదలిక కలిగింది. ఆమె కెవరో బోధించినట్లయింది. కారులో రామయ్యను ఆసుపత్రికి పంపే ఏర్పాట్లు చేసి, కూడా వెళ్తానని పట్టుపట్టిన చెల్లమ్మను ఆపుచేసింది.

చెల్లమ్మ నోటతడి ఆరేవరకు ఏడ్చింది. మితిమీరిన దుఃఖమువల్ల యిప్పు డామె కంటికి నీరు రావటములేదు. కూలిజనమంతా చెల్లమ్మను ఓదార్చుతున్నారు.

శకుంతలాదేవికి యిదంతా అయోమయంగా ఉంది.

"అయ్యో! మా మామకు కాళ్ళు విరిగిపోయినాయి. గడ్డం క్రింద రాయి లోతుగా దిగబడి పోయింది. క్రిందపడితే ఏదో పడ్డదనుకున్నాను గాని....మామ పడ్డాడని అనుకోలేదు. ఇంకెక్కడి కాళ్ళు? అయిపోయినట్లే...."

"ఏడవకు కాళ్ళు విరిగిపోలేదులే కట్టుకట్టించుకొని వస్తాడు. ఏడిస్తే వస్తాయా?" అంటూ సమాధానపెట్టున్నారు కూలీలంతా.

"ఎంత పాటు పడ్డాడు! ఇంకా అన్నము పెట్టాలని సిద్ధము చేస్తున్నాను ఎప్పటిలాగ నడుస్తాడా మా మామ? ఇవాళ లేచినవేళ మంచిది కాదు వచ్చేటప్పుడు వాళ్ళ పిల్ల తుమ్మింది. అప్పుడే అనుకున్నా ఏదో మూడుతుందని. అబ్బా! ఎంత రక్తము....ఎంత బాధపెట్టిందో...." అంటూ చెల్లమ్మ ముఖము తిరిగి పడి పోయింది.

దెబ్బ తగిలిన రామయ్యను పంపివేసి చెల్లమ్మకు రెండు మూడు గజాల దూరాన శకుంతలాదేవి చూస్తూ నిలబడిపోయింది. ఇంతచేటు బాధపడుతుందేమిటి ఈ మనిషి? ఇదంతా నిజమైన మానసికోద్రేకమేనా? చెల్లమ్మ ఇంత ఆరాటపడవల సిన అగత్యమేమిటో శకుంతలాదేవికి అవగాహన కావటములేదు. ఇన్నాళ్ళ నుంచీ కాపురము చేస్తున్న పెనిమిటికి దెబ్బ తగిలి రక్తము కారినందువల్ల మనసులో కొంచెము కష్టముగా ఉండవచ్చు కాని....అయినా చెల్లమ్మకు ఇకముందు తమ జీవనోపాధిని గురించి దిగులేమో అనుకొని,

"ఇంక సంపాదించలేడన్న దిగులా నీకు? అందుకేనా ఏడవటము" అని దూరాన నిలబడి కాస్త ధీమాగా జమీందారిణి అడిగింది.

"అమ్మా పోషణ కొరకు ఏడవటము లేదు. ఆయన పోషించలేకపోతే నేను పోషించలేనా? నాకు మేదరిపనులన్నీ వచ్చు. తడకలు బుట్టలు అల్లి నేను కూడా సంపాదిస్తూనే ఉంటాను; కాని మా మామ నవ్వుకుంటూ నడచుకుంటూ మరి రాగలడా? నేను వీళ్ళ గూడెం వచ్చి నాలుగేళ్ళయింది. ఒక్కనాడైనా నేను మా అమ్మగారింటికి వెళ్ళలేదు. మా మామ తాను కలుపుకొని అన్నము తినలేదు. నాకు నమ్మకములేదు ఆ కాళ్ళతోటి నడుస్తాడని."

"అయితే మీ కులములో మారుమనువు లేదూ? మీ కులాలలో దిగులు పడవలసిన అవసరము ఏముంది?" అన్నది శకుంతలాదేవి.

"అమ్మా. మారుమనువు ఎవరికి కావాలి తల్లీ? మా మామ మనసిచ్చి మనసును ఆకర్షించుకున్నాడు. ఒక పొల్లు మాట ఒక కల్లు బొట్టు ఎరగడు. ఒకరి జోలికి పోడు" చెల్లమ్మకు నాలుక ఎండిపోయింది, మాట్లాడే శక్తి లేక నేలకు ఒరిగిపోయింది.

అంతవరకూ నడుము మీద చేతులు పెట్టుకొని చూస్తున్న శకుంతలాదేవి హృదయము దురహంకారపూరితమైన ఆచ్ఛాదనమును విదలించుకొన్నది. మంచి నీళ్లు తెప్పించి చెల్లమ్మ గొంతులో పోయించి అరుగుమీద చాప వేయించి పడుకో పెట్టించింది. అక్కడే తానొక కుర్చీ వేయించుకొని కూర్చున్నది.

* * * * *

జమీందారిణి శకుంతలాదేవి కాపురానికి వచ్చిన పదిహేను ఏళ్ళలో నలుగురు పిల్లల తల్లి అయింది. బాల్యములో ఆమె విద్య నేర్చినట్లు కనబడదు కాని సంగీతములో ప్రావీణ్యము కలిగించుకొన్నది. మాటలో, ప్రవర్తనలో, జమీందారీ ఠీవి ఉట్టిపడేటట్లుగా మెలగట మామెకు పుట్టుకతో అబ్బిన విద్య. పెద్దదయి అత్త వారింటికి వచ్చినా ఆమెకు నలుగురితో కలిసి ఉండటము, అందరితో కలుపుగోలుగా మాట్లాడటము అలవాటు కాలేదు. తనతో మాట్లాడ వచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడ నిష్టగించక దాసీలతో రాయబారము జరిపించటము, చాలా వరకు దాసీల మధ్యనే వాళ్ళతో ప్రసంగిస్తూ కాలక్షేపము చేయుటము, ఆమెకభ్యాసమయినది.

ఆమె స్వభావమేమిటో గాని బిడ్డలనయినా ఆప్యాయంగా పిలిచి దగ్గర కూర్చోబెట్టుకొని ఎరుగదు. ఒకసారి బిడ్డకు ప్రమాదకరమైన జబ్బుచేసింది. బిడ్డ నిద్రపోయే విధము, రాత్రివేళ ఆహారము కోరటము మొదలయిన ఒకటి రెండు విషయాలు వైద్యుడు అడిగాడు. ఆయన సమక్షంలోనే దాసీని ఆమె అడగటము, అది సరిగా సమాధానము చెప్పలేకపోవటము జరిగింది. అందుకు ఆయన, "బిడ్డల విషయములో జబ్బుగా ఉన్నప్పుడయినా స్వయముగా గమనించాలండీ, నౌకర్లతో యీ పని కా"దని ఆయన అన్నాడు. ఆమెకు చాల అభిమాన మనిపించి వెంటనే వైద్యుని మార్చివేసింది.

ఆమె జీవితంలో భర్తతోటి సంభాషణలు సమావేశాలు అధికారితో ఇంటర్వ్యూ వలెనే ఉంటూ వచ్చాయి. ఆమె వచ్చినప్పటి నుంచీ ఆయన పద్ధతులేమిటో ఆయన రుచులేమిటో తెలుసుకోవాలని ఆమెకు తోచనేలేదు. ఆ భవనములో ఆమెకు కొన్ని గదులు ప్రత్యేకము- ఆయనకు కొన్ని గదులు ప్రత్యేకము. ఆయన సేవకులు వేరు- ఆమె నౌకర్లు వేరు. అందువల్ల వాళ్ళిద్దరు ఒకరిని గురించి ఒకరు ఎరుగవలసినంత ఎరుగరు. జమీందారున కిప్పుడు అనారోగ్యము కలిగి రెండు సంవత్సరాలయింది. ఆరోగ్యము అభివృద్ధి చెందవలసినంత చెందలేదు. ఆమె ఆయన దర్శనము చేసి చాలా రోజు లయినది. వ్యాధిని గురించి ఆతురతతో ఆమె ఆయనను ఎప్పుడూ అడుగనూలేదు, అడిగినప్పుడయినా ఆయన సుముఖంగా జవాబివ్వనూ లేదు. ఒకరికొకరు మర్యాదలు చేసుకోవటము మన్నించుకోవటము మిగిలింది ఆ దంపతులకు

భర్త విషయములో ఆమె హృదయము ఇంతవరకు విచ్చని మొగ్గగానే ఉంటూవచ్చింది.

"సా కిం న రమ్యా. స చ కిం న రంతా
బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా"

మేదరి దంపతుల చర్యలు ఆమెకు మొదట విపరీతముగాను ఏహ్యముగా నూ కనబడి ఆఖరుకు హృదయానురంజకములయినవి!

మేదరి చెల్లమ్మ మనసు పరిపక్వమై అనురాగపూరితమయినది! తనదో....

తన జీవితఘట్టాలను సింహావలోకనము చేసుకుంటూ చెల్లమ్మ ముఖము చూస్తూ కూర్చున్న శకుంతలాదేవి, చెల్లమ్మ దగ్గర ఒక మనిషిని ఉంచి, చివ్వున లేచి జమీందారుని గదిలోకి చరచర నడచింది, తలుపులు దగ్గరగా వేసి సేవకుడు మంచము దగ్గరగా ఒరిగినాడు. నీరసించిన దేహముతో ఒత్తిగిలి పడుకొని ఉన్న భర్తను ఒక్కసారి ఆపాదమస్తకమూ వీక్షించినది. సేవకుని బయటికి పంపి, వారికి నిద్రాభంగము చేయలేక, కాళ్ళ దగ్గరగా స్థాణువువలె నిలిచిపోయినది:

కాలికి తగిలిన స్పర్శవల్ల జమీందారుకు మెలకువ వచ్చింది. ఆకాలములో దర్శనమిచ్చిన శకుంతలాదేవిని చూడగానే ఆశ్చర్యము కలిగిన దాయనకు, లేచి కాగితము కలము చప్పున అందుకొని "దొరసానిగారు యిట్లా వచ్చిన పని ఏమిటి? నౌకరులేమయినారు" అని వ్రాసి చూపించాడు. ఆమె అది చదువుకొని కన్నీళ్ళతో "నేను మీకు ఇక నుంచి 'దొరసానిగారిని' కాను, అర్ధాంగిని. మనయిద్దరి మధ్య ఇక నుంచి నౌకర్లు ఉండరు" అంటూ మోకరిల్లింది.

అత్యాశ్చర్యములో మునిగిపోయిన జమీందారునికి వెంటనే 'ఆఁ ఏమిటీ' అంటూ రెండేళ్లుగా నిలిచిపోయిన మాటలు తిరిగి రా నారంభించినవి:

(1958లో దక్షిణ భాషా పుస్తక సంస్థవారి సంకలనం, "కథామంజరి"లో చేర్చబడి తెలుగు (కన్నడ, తమిళ, మళయాళ భాషలలోకి అనువదించబడిన కథ ఇది.)